
క్లుప్తంగా

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటుచేసుకోవాలి


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ కృష్ణనాయక్

ఉయ్యూరు: విద్యుత్ మోటార్లకు సామర్థ్యానికి అనుగుణంగా కెపాసిటర్లు ఏర్పాటుచేసుకోవాలని విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు చల్లపల్లి, ఉయ్యూరు, అవనిగడ్డ సబ్ డివిజన్‌ల పరిధిలో రెండు, మూడు, నాలుగు సర్వీసులకు నూతన విద్యుత్ మీటర్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ మోటార్ల లోడుకు అనుగుణంగా కెపాసిటర్ల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యానికి తగినట్లు కెపాసిటర్లు ఏర్పాటుచేసుకోకపోతే కేవీఏహెచ్ బిల్లింగ్ ఎక్కువగా వస్తుందన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ వార్షిక కల్యాణ మహోత్సవం ప్రారంభం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి లక్ష పుష్పార్చన జరిపారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ముత్తయిదువులకు గాజుల అలంకరణ, గోరింటాకు అలంకరణ చేశారు. సాయంత్రం భక్తులచే మండల దీక్షలో భాగంగా శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. అనంతరం వివిధ రకాల పరిమళ భరిత పుష్పాలతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వార్లకు లక్ష పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు పురప్రముఖులు, కమిటీ సభ్యులు, శ్రీలక్ష్మీతిరుపతమ్మ మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

51 వేల మంది పిల్లలకు నులి పురుగుల నిర్మూలన మందులు

విజయవాడ రూరల్: మండలంలోని 51 వేల మంది పిల్లలకు నులి పురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ టాబ్లెట్స్ అందజేస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాధురీదేవి తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా ఆమె మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ టాబ్లెట్స్ ఇస్తున్నామని చెప్పారు. ఇంటర్, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులు అనగా 19 సంవత్సరాల లోపు పిల్లలకు కూడా టాబ్లెట్స్ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మండలంలో గూడవల్లి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని పిల్లలకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, మందులు అందిస్తామన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పెరిగిన రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకున్నారు. ఆదివారం, మాఘమాసం నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగిందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఖడ్గమాలార్చనలో 29 మంది, చండీహోమంలో 96 మంది, లక్ష కుంకుమార్చనలో 27 మంది, శ్రీచక్రనవార్చనలో 11 మంది, అమ్మవారి సుప్రభాత సేవలో 17 మంది, పంచ హారతుల సేవలో 23 మంది, సూర్యోపాసన సేవలో 8 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే... ప్రమాదమే!

- రోడ్లపై జారిపడుతున్న ఇసుకతో పొంచి ఉన్న ముప్పు
- భారీలోడు వాహనాల్లో పరిమితికి మించి ఇసుక రవాణా
- పట్టించుకోని అధికారులు


కంకిపాడు అండర్‌పాస్ వద్ద సర్వీసు రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

కంకిపాడు: ఆదమరిచి వాహనం నడిపితే ప్రమాదం పలకరించినట్లే. రోడ్లపై పేరుకుపోతున్న ఇసుక ఇందుకు ప్రధాన కారణం అవుతోంది. ప్రధాన రహదారులు, మలుపులు వద్ద ఇసుక లోడు వాహనాల నుంచి జారిపడి పేరుకుపోవటంతో ప్రయాణం ప్రమాదకరంగా తయరైందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల పరిధిలో కృష్ణానది ఏటిపాయ వెంబడి ఉన్న అనేక ఇసుక రీచ్‌ల నుంచి నిత్యం వేలాది లారీలు, ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు భారీగా ఇసుక తరలిపోతుంది. ట్రాక్టర్లు, పెద్ద లారీల్లో ఇసుక రవాణా అవుతోంది.

పరిమితికి మించి రవాణా....

ఇసుక రవాణా పరిమితికి మించి సాగుతోంది. ట్రాక్టర్లు, లారీల్లో సైతం అదే రీతిగా జరుగుతుంది. పెద్ద లారీల్లో అయితే ఏకంగా 40 టన్నులకు పైగా లోడు చేస్తున్నారు. భారీ లోడుతో ఉన్న వాహనాలు రోడ్లపై వేగంగా దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు మార్గం అంతటా ఇసుక కారి మార్జిన్‌లలో ఇసుక మేట పేరుకుపోతుంది. రోడ్డు మార్జిన్‌లు, మలుపులు, సర్వీసు రోడ్డు పాయింట్ల వద్ద ప్రమాదకరస్థాయిలో ఇసుక పేరుకుపోతుంది. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు రోడ్డు మార్జిన్‌లు, సర్వీసు రోడ్డు పాయింట్లలో పేరుకుపోయిన ఇసుక కారణంగా జారిపడి గాయపడుతున్నారు. ఇటీవల వారం రోజుల్లో జాతీయ రహదారిపై కంకిపాడు పరిసర ప్రాంతాల్లో కేవలం ఇసుక కారణంగా పది మందికి గాయాలయ్యాయంటే సమస్య తీవ్రత ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అధికారుల జాడేదీ....?

భారీ లోడుతో ఇసుక వాహనాలు దూసుకుపోతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రవాణా, రెవెన్యూ, పోలీసు ఇతర శాఖలు ఏవీ పట్టించుకున్న పాపాన పోవటం లేదు. పరిమితికి మించి ఇసుక లోడు జరుగుతున్నా, రవాణా సాగుతున్నా కనీసం తనిఖీలు చేయటం లేదంటే ఏ మేరకు 'సహకారం' అందుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవటం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వైభవంగా వీరమ్మతల్లి గ్రామోత్సవం



ఊయల ఉత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారికి దీపాలతో స్వాగతం

ఉయ్యూరు: శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. మెట్టినింటి నుంచి శ్రీకనక చింతయ్య సమేతంగా శనివారం రాత్రి పల్లకిలో బయలుదేరిన అమ్మవారు ఆదివారం పట్టణ పురవీధుల్లో ఊరేగారు. అడుగడుగునా అమ్మవారికి ప్రజలు మొక్కులు చెల్లించి ఘనస్వాగతం పలికారు. అమ్మవారి పల్లకిపై పూల వర్షం కురిపిస్తూ పసుపునీళ్లు ఒరబోసి భక్తిపారవశ్యం చెందారు. కాటూరురోడ్డు, మార్కెట్ సెంటరు, కాపుల రామాలయం, సుందరమ్మపేట, కొబ్బరితోట, కాకాని పార్కు సెంటరు, బస్టాండు ప్రాంతాల్లో అశేష భక్తజనం గ్రామోత్సవంలో పాల్గొని జై వీరమ్మ...జై జై వీరమ్మ అంటూ అమ్మవారికి పూజలు చేశారు. తమ ఇంటి ముంగిటికే వచ్చిన చల్లని తల్లికి హారతులు పట్టి పసుపు కుంకుమలు సమర్పించారు. తిరుగుడు గండ దీప భక్తులు గ్రామోత్సవంలో అమ్మవారి వెంటే నడుస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సీఐ రామారావు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబడ్కేర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు బోడపాడు ఇందిరాకాలనీలో రాజ్యాంగ నిర్మాత భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.బాబు, యేసుబాబు, రాహుల్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.లక్ష విరాళం


శంకరనారాయణ, సీత దంపతులను సత్కరిస్తున్న వాకర్స్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు శంకరనారాయణ భరద్వాజ శ్రౌతి, సీత దంపతులు రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం విరాళం నగదును వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్‌కు ఆ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా శంకరనారయణ, సీత దంపతులను వాకర్స్ అసోసియేషన్ తరుపున శాలువాలు కప్పి సత్కారించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్, దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు రూ. 10 లక్షలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు, వాకర్స్ ఆఫీస్ అధునికీకరణ తదితర మౌలిక సదుపాయలు కల్పించినట్లు తెలిపారు. కొత్తగా క్రీడా ప్రాంగణంలో బోర్‌వెల్ ఏర్పాటు, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. తన విజ్ఞప్తి మేరకు క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ముందుకు వచ్చిన శంకరనారాయణ, సీత దంపతులను ఆయన అభినందించారు. వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు టిఎస్ఆర్‌కె. ప్రసాద్, కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాసరావు, సలహాదారులు తిరివీధి వెంకయ్య, హెచ్ఎంలు జీవీ. రవిబాబు, కేఎస్. జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం...

తొలుత క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్, అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని వాకర్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ఝాన్సీ రాణి నేతృత్వంలో వైద్య బృందం వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాకర్స్ చిల్లపల్లి శ్రీనివాసరావు, బొకినాల కోటేశ్వరరావు, చిమట రామారావు, లక్ష్మీనారాయణ, ధనియాల నాగరాజు, కంకణాల వెంకటేశ్వరరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



ప్రసంగిస్తున్న మచిలీపట్నం ముడా చైర్మన్ మట్టప్రసాద్ : విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ మట్ట ప్రసాద్ అన్నారు. కానూరులో ఆదివారం వికాస్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువుతోనే అభివృద్ధి సాధించగలుగుతామన్నారు. ఒత్తిడి లేని చదువు విద్యార్థులకు అవసరమన్నారు. దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. డెప్యూటీ కలెక్టర్ తోట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయ. డాక్టర్ సుజాత, పాఠశాల డైరెక్టర్లు లక్ష్మీరామ్, రఘురామ్, రింజిత్‌రామ్ పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దర్శకుడు సుసర్ల జయంతి

విజయవాడకల్చరల్: సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి అని సంగీత విద్వాంసుడు అన్నవరపు రామస్వామి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సుసర్ల సంగీత వాహిని, తెలుగు కళావాహిని, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం సుసర్ల 104వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, అన్నవరపు రామస్వామికి 'సుసర్ల అవార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. రామస్వామి మాట్లాడుతూ సంగీత కళాకారులు సుసర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

గంగూరులో టీడీపీ కార్యకర్తల వీరంగం


గంగూరు సెంటర్‌లో గొడవ


ఎమ్మెల్యే పేరుతో ఉన టీషర్టు వేసుకుని గొడవ చేస్తున్న టీడీపీ కార్యకర్త

పెనమలూరు: గంగూరు సెంటర్ వద్ద ఆదివారం టీడీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. మద్యం సేవించిన కొందరు వ్యక్తులు స్థానికులతో తగాదా పడి హడావుడి చేశారు.అయితే స్థానికులు ప్రతిఘటించారు. దీంతో గంగూరు సెంటర్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మద్యం సేవించి అల్లరి చేస్తున్న టీడీపీ కార్యకర్తలను స్థానికులు నిలదీశారు. టీడీపీ కార్యకర్తలను దేహశుద్ధి చేయటానికి స్థానికులు ఏకం కాగా అయితే అదే సమయంలో అటుగా వచ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్ టీడీపీ కార్యకర్తలను అక్కడి నుంచి పంపారు. మద్యం తాగి గొడవ సృష్టించిన టీడీపీ కార్యకర్తలు పసురంగు టీషర్టు వేసుకొని ఉండగా దాని పై ఎమ్మెల్యే ఫొటో, పేరు ముద్రించి ఉంది.

వీరవల్లిలో రెండు స్వీట్ షాపుల్లో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో రెండు స్వీట్స్ షాపుల్లో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న ఈ దుకాణాల్లో దొంగతనంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ స్వీట్స్, సత్యనారాయణ స్వీట్స్ షాపుల్లో శనివారం అర్ధరాత్రి వేళ షట్టర్ల తాళాలు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించిన దుంగడులు తిరుబండారాలతో సహా స్వల్ప మొత్తంలో నగదును అపహరించుకుని పోయారు. యథావిధిగా ఆదివారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన యజమానులు తాళాలు బద్దలు కొట్టి ఉండటం చూసి అవాక్కయ్యారు. అందోళనతో షట్టర్లు తెరిచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనలపై స్వీట్ షాపు యాజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్మశానవాటికలో వసతులు కరువు

- మొత్తం పిచ్చిమొక్కలతో నిండిన వైనం
- శిథిలావస్థలో ప్రహరీ
- పట్టించుకోని అధికారులు


శ్మశానంలో అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు హిందూ శ్మశానవాటికలో కనీస వసతులు కరువై గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరానికి అతి సమీపంలో ఉన్న గ్రామమైనప్పటికీ శ్మశాన అభివృద్ధి మాత్రం ఎవ్వరికీ పట్టడం లేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 50 వేల మంది నివాసం ఉంటున్న గ్రామం మొత్తానికి పీఎస్ఆర్ కాలనీలోని ఒకే ఒక్క హిందూ శ్మశానం. గ్రామం మొత్తానికి ఒకే శ్మశానం కావడంతో అంతిమ సంస్కారాలకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించడం నేటికీ పూర్తి చేయలేదు. పిచ్చి మొక్కలు, అల్లుకుపోయిన ముళ్ల కంపలు, విష సర్పాల సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మరో పక్క రాత్రిళ్లు ఆకతాయిలు మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం నిత్యకృత్యమవుతుంది.

గత ప్రభుత్వంలో అభివృద్ధి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శ్మశానవాటిక దీనస్థితిని అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీంతో వంశీ ప్రత్యేక చొరవ తీసుకుని శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించారు. అప్పట్లో మండల, పంచాయతీ నిధులు సుమారు రూ. 50 లక్షలు కేటాయించడంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. దీనికి తోడు గ్రామానికి చెందిన దాత కందిమళ్ల ఆంజనేయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమారు రూ.10 లక్షలతో ధ్యాన ముద్రలో ఉన్న శివుని విగ్రహాన్ని, మరో రూ.5లక్షలు ఇతరత్రా పనులకు విరాళం అందజేశారు. శివుని విగ్రహం ఏర్పాటు చేసి రంగులు వేశారు. అప్పటి ప్రభుత్వం కేటాయించిన నిధులతో కొంత మేర నిర్మాణ పనులు నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో మిగులున్న అభివృద్ధి పనులు గాలికి వదిలేయడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.


అసంతృప్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు

శిథిలావస్థలో...

1.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ శ్మశాన వాటికలో ఇప్పటికి కూడా మరుగుదొడ్లు, దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేయలేదు. పైగా ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. వెయిటింగ్ హాలు, జల్లు సాన్నాల గదులు, పిండ ప్రధానం చేయడానికి అవసరమైన సౌకర్యాలను నేటికి కూడా కల్పించలేదు. మృతదేహాలను దహనం చేయడానికి అల్యూమినియం స్ట్రక్చర్లు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎళ్ల తరపడి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శ్మశానంలో వసతుల కల్పనకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తిరునాళ్లలో గందరగోళం


బారికేడ్లు విరగటంతో స్పృహతప్పిన భక్తురాలు


108లో భక్తురాలిని తరలిస్తున్న సిబ్బంది

ఉయ్యూరురూరల్: వీరమ్మతల్లి ఊయల ఉత్సవంలో గందరగోళం చోటుచేసుకుంది. కాలేజ్ రోడ్డులో నుంచి పల్లకిలో ఊరేగుతూ ఊయల స్తంభాలకు వస్తున్న అమ్మవారు పల్లకి తిరిగే క్రమంలో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసుల మధ్య సమన్వయం కొరవడటంతో ఈ గందరగోళం నెలకొంది. పల్లకిని ఒక్కసారిగా ఊయల స్తంభాల వైపు తిప్పటంతో భక్తులు బారికేడ్లు మీద పడటంతో విరిగిపోయాయి. ఈ తోపులాటలో 20 మంది భక్తులు కిందపడిపోయారు. అప్రమత్తమైన పోలీసులు భక్తులు సహాయక చర్యలు సమర్థంగా తీసుకోవటంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు అస్వస్థతకు లోనయ్యారు. ఓ మహిళా భక్తురాలు స్పృహ కోల్పోవటంతో 108 సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఎలాంటి ప్రాణాపాయం చోటుచేసుకోకపోవటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఈ తరహా ఘటన ఊయల ఉత్సవం వద్ద చోటుచేసుకోవటం ఇదే ప్రథమం.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- పార్టీ జెండాలతో ర్యాలీ నిర్వహించిన టీడీపీ శ్రేణులు
- కంకిపాడు నుంచి పోరంకి వరకూ ర్యాలీ
- పట్టించుకోని అధికార యంత్రాంగం


జెండాలతో ర్యాలీ

కంకిపాడు(పెనమలూరు): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పక్షం అండతో కొందరు నేతలు కోడ్ ఉల్లంఘిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ, జనసేన పార్టీ జెండాలతో ద్విచక్రవాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.

అయినా అధికారులు ఎవరూ కోడ్ పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది. పలువురు నాయకులు పార్టీలో చేరుతున్నారనే సాకుతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కంకిపాడు నుంచి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కోడ్ ఉల్లంఘిస్తూ టీడీపీ, జనసేన జెండాలను వాహనాలకు కట్టి ర్యాలీ చేపట్టారు. దారిపొడవునా రణగొణ ధ్వనులతో హడావిడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, కోడ్ ఉల్లంఘిస్తూ జెండాలు కట్టినా, ర్యాలీ చేసినా కోడ్ పరిరక్షణ చేపట్టాల్సిన అధికారులు స్పందించలేదనే విమర్శలొచ్చాయి.

మరియమాతకు నీరాజనం








గుణదలలో మేరీమాత ఉత్సవాలకు తొలిరోజైన ఆదివారం భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. మరియతల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దీంతో గుణదల కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ గురువులు భక్తులను ఆశీర్వదించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ